శనగ రైతు కుదేలు..

- మొలకెత్తని ప్రభుత్వ సబ్సిడీ శనగ విత్తనాలు
- లబోదిబోమంటున్న రైతులు
- ఎకరాకు రూ.20 వేలు ఖర్చు
- ప్రభుత్వం వైఫల్యంపై రైతులు మండిపాటు
- మండలంలో 3500 హెక్టార్ల వరకు మొలకెత్తని శనగ విత్తనలు


పోట్లదుర్తి గ్రామ పరిధిలో శనగ విత్తనాలు మొలకత్తెక పోవడంతో అధికారికి చూపిస్తున్న రైతులు


విత్తనాలు మొలకెత్తని భూమి

ఎర్రగుంట్ల : రబీలో సాగు చేసిన పప్పు శనగపై రైతులు ఎంతో ఆశలు పెట్టుకుని సాగు చేశారు. అయితే ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన సబ్సిడీ విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సుమారు ఎకరాకు రూ.20 వేలు ఖర్చుపెట్టి పప్పుశనగను సాగు చేశారు. సాగుచేసి 16 రోజులైనా శనగ మొలక ఎత్తలేదని రైతులు వాపోతున్నారు. గోడౌన్‌లలో దాచి పెట్టిన పప్పుశనగ నాణ్యతను చూడకుండానే ప్రభుత్వం రైతులకు సరఫరా చేసిందని అందుకు విత్తనాలు పొలంలో మొలకెత్తలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు సకాలంలో పడటంతో పప్పుశనగ సాగుపై ఆశక్తి చూపామన్నారు. అరకొర సబ్సిడీతో కూటమి ప్రభుత్వం రైతులను దగా చేసిందన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు 40 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేస్తే కూటమి ప్రభుత్వం కేవలం 25 శాతంతో అందించింది.

పెట్టుబడి సాయం కూడా అంతే

రైతులకు పెట్టు బడి సాయం కూడా ఈ ప్రభుత్వం అందించలేదు. అయినా రైతులు ఖర్చులు పెట్టుకుని ఎంతో ఆశతో సబ్సిడీ విత్తనాలతో పప్పుశనగను సాగు చేశారు. మొలకత్తకుండా భూమిలో విత్తనాలు కుళ్లిపోయాయి. తీవ్రమైన నష్టంను రైతులు చవిచూశారు. రైతులకు అందించాల్సిన పెట్టుబడి సాయం కూడా ఇంత వరకు ఈ కూటమి ప్రభుత్వం అందించలేదని రైతులు వాపోయారు.

3500 హెక్టర్లల్లో పప్పు శనగ మొలకెత్తలేదు

మండల వ్యాప్తంగా 4500 హెక్టర్లల్లో పప్పు శనగ సాగు చేశారు. కానీ ఇందులో మొలక శాతం 3500 హెక్టర్లలో రాలేదు. మొలక వస్తుందా లేదా అని అనుమానంతో రైతులు కుంగిపోతున్నారు. సాగు చేసిన విత్తనాలు కొన్ని చోట్ల భూమిలోనే కుళ్లిపోగా, మరి కొన్ని చోట్ల మొలకత్తలేదని వారు చెబుతున్నారు.

ఎకరాకు రూ.20 వేలు ఖర్చుతో సాగు చేశా


15 ఎకరాలలో పప్పు శనగను ప్రభుత్వం అందించిన సబ్సిడీ విత్తనాలతో సాగు చేశాను. పంట సాగు చేసి సుమారు 13 రోజులు దాటినా ఇంత వరకు ఒక్క మొలక కూడా రాలేదు. తీవ్రంగా నష్టం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి.
– జంగ మల్లిఖార్జునరెడ్డి, రైతు పోట్లదుర్తి.

పంట కాలం దాటినా పొలంలో మొలక రాలేదు


నేను 10 ఎకరాలలో పప్పు శనగ సాగు చేశాను. ఎకరాకు రూ.20 వేలు ఖర్చు అయింది. పంట కాలం సాదారణంగా వారం రోజులకే భూమిలో మొలకలు వస్తాయి. కానీ 15 రోజులు దాటిన ఇంత వరకు మొలకలు రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి.
– పడిగపాటి పెద్ద సుబ్బారెడ్డి, రైతు, పోట్లదుర్తి.

సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదించాం


మండల వ్యాప్తంగా రైతులు 4500 హెక్టర్లలో పప్పు శనగ సాగు చేశారు. రైతులకు సబ్సిడీ శగన విత్తనాలు అందించాం. అయితే కొన్ని చోట్ల విత్తనాలు మొలకత్తలేదు. మరి కొన్ని చోట్ల తక్కువ మొలక శాతం ఉంది. పూర్తిగా సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. దీనిపై త్వరలోనే శాస్త్ర వేత్తల బృందం కూడా మండలంలో పర్యటిస్తుంది. రైతులు నిరాశ పడవద్దు. కొంత ఆలస్యంగా అయిన విత్తనాలు మొలకలు రావచ్చు.
– శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ అధికారి, యర్రగుంట్ల

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగాల : మండలంలోని వెలిదండ్ల, మురారిచింతల, కోమన్నూతల, తాతిరెడ్డిపల్లె, పార్నపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ బాల సంజీవులు తెలిపారు. ప్రజలు, రైతులు గమనించి సహకరించాలన్నారు.

ముద్దనూరు..

ముద్దనూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ వర్మ తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం1 గంటల వరకు విద్యుత్ సరఫరా వుండదని, మరమ్మతుల కారణంగా కోత వుటుందని ఆయన తెలిపారు.

పులివెందుల..

పులివెందుల రూరల్ : పట్టణంలోని పార్నపల్లె రోడ్డు, పూలంగళ్ల సర్కిల్, సదాశివారెడ్డి ఆసుపత్రి, పెద్ద కొండప్పకాలనీ, దర్గావీధి, నగరిగుట్ట మసీదు తదితర ప్రాంతాలలో శనివారం ఉదయం 9 గంటల నుండి 12 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ జేఈ రమేష్ తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఎర్రగుంట్ల..

ఎర్రగుంట్ల : మండలంలోని మాలెపాడు, చిన్నదండ్లూరు, ఆర్టీపీపీ, సిరిగేపల్లి, చిలంకూరు, కలమల్ల, కేవీపల్లి, కమాలపురం పరిధిలోని కోగటం గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

నేత్రదానం


మృతుడి కుటుంబ సభ్యులనుంచి కార్నియాలను సేకరిస్తున్న రాజు, తదితరులు

పులివెందుల టౌన్ : నేత్రదానంతో అంధులకు చూపును ప్రసాదించవచ్చునని నేత్ర సేకరణ సంస్థ అధ్యక్షుడు రాజు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రంగారెడ్డి వీధికి చెందిన సత్యానారాయణ మరణించడంతో ఆయన భార్య పద్మావతి, కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్ర సేకరణ సంస్థకు సమాచారం ఇచ్చారు. దీంతో రాజు టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని ఇంటి వద్దకు వెళ్లి మృతదేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్ లోని డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధికి పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి మరణానంతరం నేత్రాలు మట్టిలో కలిసిపోకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కుటుంబంలోని ప్రతి వ్యక్తికి, సన్నిహితులకు నేత్రదానంపై అవగాహన కల్పించి ఎవరూ మరణించిన నేత్రదానం చేసేందుకు ఒప్పించాలన్నారు.

అనాథ వృద్ధులను ఆదుకోవాలి


వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న ఎస్‌ఐ తిరుపాల్ నాయక్

వేంపల్లె : ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో అనాథ వృద్ధులను ఆదుకోవాలని వేంపల్లి ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. శుక్రవారం వేంపల్లె సమీపంలోని స్థానిక పాత గండి రోడ్డులో ఉన్న మదర్‌థెరిసా చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మనం సంపాదించిన దానిలో కొంతమేర ఇలాంటి కార్యక్రమాలు చేయడంద్వారా మానసిక సంతృప్తినిస్తుందన్నారు. అనంతరం వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

జీతాలు ఇవ్వాలని వినతి

పెద్దముడియం : మండలంలోని గ్రామాలలో పనిచేస్తున్న విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్‌కు జీతాలు నెల నెలా ఇవ్వడంలేదని దీనిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం తహసీల్దార్ బాలనరసింహులుకు వారు వినతిపత్రం అందజేశారు. జూనియర్ అసిస్టెంట్ మీనాక్షి వీఆర్‌ఏలలో ఒకరు ఆమె చెప్పిన పనిచేయకపోవడం వలన మెత్తం వీఆర్‌ఏల జీతాలు ఆపడం వలన చాలా ఇబ్బందులకు గురి అవుతున్నామని తెలిపారు. తమకు నెల నెలా జీతాలు సక్రమంగా పడే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను వారు కోరారు.

ఇద్దరిపై కేసు నమోదు

కొండాపురం : ఇంటి స్థలం విషయంలో ఇద్దరిపై కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్సీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విద్యసాగర్ శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలోని 203 సర్వే నెంబర్‌లో ప్లాట్ నెంబర్ 190 స్థలం విషయంపై చౌటిపల్లె గ్రామానికి చెందిన వై.వెంకటేష్ వర్మ, కొర్రపాడు గ్రామానికి చెందిన ఇద్దరు ఒకరి ఒకరు గొడవ పడ్డారు. ఈ గొడవలో కులం పేరుతో దుషించారని వెంకటేష్‌వర్మ ఫిర్యాదు మేరకు అట్రాసిటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పంటల పరిశీలన

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరు, కసనూరు గ్రామాల్లో శుక్రవారం కేవీకే శాస్త్రవేత్తలు బాలకృష్ణ, అధిపతులు చీనీ, వేరుశన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు చీనీలో వేరుకుళ్లు, ఆకు ముడత తెగులు, సూక్ష్మ పోషక లోపాలు, కాయలకు ఉన్న మంగు, శనగ పంటలో పచ్చ పురుగు తెగులు ఆశించినట్లు గుర్తించారు. అలాగే శనగ పచ్చపురుగు నివారణకు జాగ్రత్తలను తెలియజేశారు. వేరుశనగలో నీటి తడులు ఎక్కువగా ఉండటంవల్ల తీవ్రతను బట్టి 15 రోజులకొక సారి జిప్సం వేసుకోవాలన్నారు. కార్యక్రముంలో వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓ మృతి


నివాళులు అర్పిస్తున్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పీ రవీంద్రనాథరెడ్డి

వల్లూరు : మండలంలోని కోట్లూరు వీఆర్‌ఓగా పనిచేస్తున్న బండి రామ్మోహన్ గురువారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. కడప పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో నివాసం వుంటున్న ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో బంధువులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు వున్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆయన నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు. అలాగే సమాచారం అందుకున్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి వారి గృహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఫ్రైడే... డ్రై డే తప్పక పాటించాలి


కమలాపురంలో మురికి కాలువను పరిశీలిస్తున్న డీఎంఅండ్ హెచ్‌ఓ నాగరాజు

కమలాపురం : ప్రతి ఒక్కరూ ఫ్రై డే. డ్రై డే పాటించాలని డీఎం అండ్ హెచ్‌ఓ నాగరాజు తెలిపారు. శుక్రవారం కమలాపురం నగర పంచాయతీలోని తూర్పు గండ్లూరు కాలనీలో ఆయన పర్యటించి మురికి కాలువను పరిశీలించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అపుడే రోగాలు దరి చేరవన్నారు. ప్రతి శుక్రవారం డ్రై...డే పాటించాలన్నారు. ఇంటి వంట పాత్రలు, నీరు నిల్వ ఉన్న పాత్రలు కడిగి ఆరబెట్టాలన్నారు. వారంలో ఒక రోజు ఈ పని తప్పని సరిగా చేయాలన్నారు. పాత టైర్లు, తాగి పడేసిన టెంకాయలు లాంటివి ఇళ్ల వద్ద ఉంచరాదన్నారు. వాటిలో లార్వా చేరే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా మురికి నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమలు చేరకుండా అబెట్ ద్రావణాన్ని పిచికారి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు చీకటి పడగానే తలుపులు, కిటికీలు మూసి వేయాలన్నారు. అలాగే దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన ఉండాలి


బాల్య వివాహ నిషేద చట్టంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునీత, తదితరులు

వేంపల్లె : విద్యార్థులు బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సునీత తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలకు బాలల న్యాయ చట్టం, బాల్య వివాహ నిషేధ చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల విద్యార్థి దశలో వారందరికీ రక్షణ కల్పించడమనేది విద్యార్థి దశలో క్లిష్టమైందన్నారు. బాలుడు, బాలిక బహుముఖాభివృద్ధికి లక్ష్యంగా కావాలన్నారు. పిల్లల మానసిక శారీరక సామర్థ్యాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసుకోవాలన్నారు. ముఖ్యంగా చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్1098 గురించి తప్పక తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో లీగల్ ఆఫీసర్ సునీత, సూపర్‌వైజర్లు నాగరత్న, అంగన్‌వాడీ వర్కర్ చంద్రవతి, పాఠశాల ఆధ్యాపకులు పాల్గొన్నారు.

పంటలకు చీరలే శ్రీరామరక్ష


పంటలను కాపాడుకునేందుకు చీరలను ఏర్పాటు చేసుకున్న రైతులు

పులివెందుల రూరల్ : రైతులు సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు మహిళలు ధరించే చీరలే శ్రీరామరక్షగా వాడుతున్నారు. మండలంలోని నల్లపురెడ్డిపల్లె, తుమ్మలపల్లె, ఎర్రబల్లె, కనంపల్లె, నల్లగొండువారిపల్లె గ్రామాలతోపాటు నియోజకవర్గంలోని పలు మండలాల్లోని గ్రామాల రైతులు సాగు చేసిన పంటలకు శ్రీరామరక్షగా చీరలను వాడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలో కొండలు, గుంటల సమీపాలలో ఉన్న అడవి జంతువులు పంటల పొలాల్లోకి రాకుండా చీరలను ఏర్పాటు చేసుకున్నారు.

బీమాపై రైతులకు అవగాహన కల్పించండి


వ్యవసాయ సిబ్బందికి సర్టిఫికెట్‌ను అందిస్తున్న జేడీఏ, తదితరులు

పులివెందుల రూరల్ : పీఎం ఫసల్ బీమా యోజన పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో రైతుసేవా కేంద్ర సహాయకులకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి రైతులకు సమాచారాన్ని సలహాలను అందించాలన్నారు. ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ అంకయ్యకుమార్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మీ పరిధిలోని రైతులు పండించే పంటలలో చీడపీడలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, అధిక దిగుబడుల కోసం పంటల యాజమాన్య పద్ధతులను వివరించారు. జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ శనగ, వేరుశనగ పంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలన్నారు. అనంతరం సిబ్బందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏఓలు చెన్నారెడ్డి, రమేష్, నాగలక్ష్మి, నవంత్ బాబు, రాజేంద్రప్రసాద్, సునీల్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

లింగాల : ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారాన్ని డ్రై డే పాటించాలని సీహెచ్‌ఓ శివరాం తెలిపారు. శుక్రవారం లింగాలలో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల లార్వాల నివారణకు మందులను పిచికారి చేయించాలన్నారు. ప్రజలకు దోమల నివారణపై, వాటివల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఆశాబేగం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు నమోదు

పులివెందుల టౌన్ : మండలంలోని ఓటర్లందరూ ఈనెల 9వ, 10, 23, 24వ తేదీలలో ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నజీర్ అహమ్మద్ తెలిపారు. పట్టణంలోని ఆయా పోలింగ్ కేంద్రాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలవరకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, ఓటరు నమోదులో ఎలాంటి సమస్యలు ఉన్న దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు కార్డులలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు ఉంటే ఆయా ఫారాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ముద్దనూరు : స్థానిక బాలనారాయణరెడ్డి ఆసుపత్రిలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన హారిక హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ ట్రామా, ఎముకలు, కీళ్ళ శస్త్ర చికిత్స నిపుణులు, ఎం.రమేష్, జనరల్, క్రిటికల్ కేర్‌స్పెషలిస్ట్ డాక్టర్ నాగయ్యలు ఉచిత వైద్య చికిత్సలు అందిస్తారని డాక్టర్ వజ్యోత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా కలర్స్ డే వేడుకలు


కలర్స్ డే వేడుకలలో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

వేంపల్లె : స్థానిక శ్రీ చైతన్య హైస్కూల్‌లో ప్రైమరీ విద్యార్థులతో శుక్రవారం కలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. విద్యార్థులు వివిధ రంగుల వేషధారణలో రాగా, వేడుకలతో అందరినీ అలరించారు. ముఖ్యంగా పిల్లల ప్రసంగాలు, నృత్యాలతో ఈ కార్యక్రమం కళకళలాడింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల బీమా రైతులకు ధీమా

సింహాద్రిపురం : పంటల బీమా రైతులకు ధీమా అని మండల వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకులో మాత్రమే పంటల బీమా చెల్లించాలన్నారు. ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు రైతులకు పంటల బీమా భరోసాను కల్పిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు ఆయా గ్రామాల ఆర్‌ఎస్‌కే సిబ్బందిని సంప్రదించాలన్నారు. డిసెంబర్ 15వ తేదీలోపు పంటల బీమా చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు.

అమ్మవారికి ఘనంగా పూజలు



వల్లూరు : స్థానిక శ్రీ భవానీ శంకర ఆలయంలో కార్తీక మాస మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ చక్ర సహిత భవానీ మాతను ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ఆకు పూజలను, కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రీ శంకరస్వామి అర్ధనారీశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి అభిషేకాలను నిర్వహించారు. అనంతర భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు : ముద్దనూరు రహదారిలో ఉన్న సచివాలయంలో ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నూతన ఆధార్‌కార్డులకు, మార్పులు చేర్పులను చేయించుకోవడం కోసం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు సంబంధించిన ఆధార్ అప్‌డేట్ కూడా చేయించుకోవచ్చు అని సూచించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హాస్టల్ విద్యార్థుల కడుపు కొట్టకండి


సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ రామాంజనేయిలుకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్, సీపీఐ నాయకులు

పులివెందుల టౌన్ : హాస్టల్ విద్యార్థుల కడుపు కొట్టకండని.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర, సీపీఐ నియోజకవర్గ ఏరియా కార్యదర్శి వెంకట్రాములు తెలిపారు. శుక్రవారం వారు సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ రామాంజనేయులును కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పట్టణంలోని లయోలా డిగ్రీ కాలేజ్ దగ్గర ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు వసతి పొందుతున్నారని, అయితే విద్యార్థులు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతమంది విద్యార్థులకు నాలుగు బాత్రూంలు సరిపోవడంలేదని, అన్నం సరిగా ఉండటంలేదన్నారు. అలాగే మధ్యాహ్నం లంచ్ బాక్స్‌లో అన్నం తక్కువగా పెడుతున్నారన్నారు. ఆర్థిక స్థోమత లేక వసతి పొందుతున్న విద్యార్థులకు మంచి ఆహారం, వసతి సౌకర్యాలు అందేలా చూడాలని కోరారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్, తదితరులు

పులివెందుల రూరల్ : సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ హ్యాండ్‌బాల్ పోటీలకు పులివెందుల జేఎన్‌టీయూ విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. శుక్రవారం స్థానిక జేఎన్‌టీయూలో ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీలకు అనంతపురం జేఎన్‌టీయూ యూనివర్శిటీ పరిధిలోని వివిధ కళాశాలల నుండి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారని, వీరిలో కొంతమంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు 2025 మార్చిలో తమిళనాడులోని పెరియార్ యూనివర్శిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ హ్యాండ్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ శేషమహేశ్వర మ్మ, స్పోర్ట్స్ ఇన్‌చార్జి దామోదర్‌రెడ్డి, సెలెక్షన్ కమిటీ మెంబర్ గోవర్ధన్, పీడీలు డేవిడ్, సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


అరటి పంటను పరిశీలిస్తున్న జర్మన్ శాస్త్రవేత్తలు రెహమాన్, వాల్టోని, తదితరులు

పులివెందుల రూరల్ : ప్రకృతి వ్యవసాయంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని జర్మన్ దేశ శాస్త్రవేత్తలు రెహమాన్, వాల్టోనిలు తెలిపారు. శుక్రవారం కొత్తపల్లె గ్రామంలో అరటి తోటలను అరటి పరిశోధనా శాస్త్రవేత్తలు శివరామకృష్ణ, సునీల్, ఏపీ కార్ల్ సీఈఓ శివారెడ్డిలతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన ఐదు ఎకరాల అరటిని, రసాయన ఎరువుల ద్వారా సాగుచేసిన ఐదు ఎకరాల అరటిని పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలే ఏపుగా ఉండడంతో పాటు కాయలు నాణ్యతగా ఉన్నాయన్నారు. రసాయన ఎరువులు వాడటంవల్ల పంటలు పూర్తిగా దెబ్బతినడంతోపాటు భూమి కూడా సారవంతం తగ్గిపోతుందన్నారు. అందువల్ల ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తమ పంటలను పండించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు


హియరింగ్ మిషన్లు అందుకున్న విద్యార్థులతో జడ్జి బాబా ఫకృద్దీన్

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : మండల పరిధి ప్రకాశంపల్లెలోని ఆశా నిలయం ప్రత్యేకపాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ వారు ప్రవేశపెట్టిన నల్సా పథకములైన బాలల స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015, మానసిక అనారోగ్య, వికలాంగులకు చట్టపరమైన సేవలు పథకం 2015, విభిన్న ప్రతిభావంతుల పిల్లల కోసం న్యాయ సేవలు పథకం 2021ల గురించి, అలాగే న్యాయ సేవల టోల్ ఫ్రీ నెంబర్ 15100 ఉపయోగాలు గురించి సమగ్రంగా వివరించడం జరిగింది. విభిన్న ప్రతిభావంతులకు సంబంధించిన డిపార్ట్‌మెంట్, వైద్య శాఖ స్టాల్స్‌ని ఏర్పా టు చేసింది. వైద్యులు మెడికల్ క్యాంపు, ఆడియో మెట్రిషన్ టెస్టులు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. న్యాయమూర్తి బాబాఫకృద్దీన్ 8 మంది ప్రత్యేక పిల్లలకు హియరింగ్ మిషన్స్ అందజేశారు. కార్యక్రమంలో ట్రైనీ జడ్జీలు నందిని, ఖాజామోయినుద్దీన్, అనిల్ కుమార్ నాయక్, ఆశాప్రియ, వైద్యాధికారి సునీత ఆడియాలజిస్ట్ శ్రీలేఖ, ఆశా నిలయం ప్రతేకపాఠశాల హెడ్ మిస్సెస్ డోలిమా థ్యూస్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

కార్తిక మాస పూజలు


ఆలయానికి వెళ్లే మెట్లమార్గం


శ్రీసిద్ధలింగేశ్వరస్వామి మూలవిరాట్

పులివెందుల టౌన్ : మండలంలోని నామాలగుండు సిద్ధలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పి.లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రతి సోమవారం ఆలయంలో అర్చనలు, అభిషేక పూజలతోపాటు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు, అలాగే పౌర్ణమిరోజున హరికథ కాలక్షేపంతోపాటు, మూడవ, నాల్గవ సోమవారాలలో భజనలు, పురాణ కాలక్షేపములు నిర్వహిస్తున్నామన్నారు. ప్రకృతి అందాల నడుమ పాలకొండలలో వెలసిన శ్రీనామాలగుండు సిద్ధలింగేశ్వరస్వామిని దర్శించి తరించాలన్నారు.